# పరమేశ్వర పరీక్ష

ఒకానొకప్పుడు బ్రహ్మకు, శ్రీ మహావిష్ణువుకు నేను గొప్పంటే నేను గొప్ప అనుకునే సమయం వచ్చింది. ఈ ప్రపంచ సృష్టికి మూలము నేను. ఏది పుట్టినా, ఏది వెలసినా అందుకు మూలకారకుణ్ణే నేను. అందువలన నేనె గొప్ప అన్నాడు బ్రహ్మ. "నీ గొప్పేమిటి. అసలు నిన్ను పుట్టించిం దెవరో తెలుసా? నా బొడ్లోంచి వచ్చిన తామరపువ్వులో నువు పుట్టావు. నీ సంగతి తెలియకుండానే, గొప్పవాణ్ణి అని గర్వపడుతున్నావా? అని అన్నాడు విష్ణుమూర్తి కోపంగానే. 'నీవు చేసే పని నేను సృజించిన మానవులకు ఇంత తిండి పడేస్తున్నావు. అసలు నేను సృష్టించట మేమానుకుంటే, నీ వుండే అవసరమూ ఉండదు; నీవు చేయాల్సిన పనీ ఉండదు తెలుసా? ఏదో త్రిమూర్తులలో ఒకడివని గర్వముగాబోలు, అని ఎత్తి పొడిచాడు బ్రహ్మ. నేను గొప్ప అంటే నేను గొప్ప అని వాదించుకోసాగారు. చివరకు అదేజుట్లు పట్టుకునే వరకు వచ్చింది.

ఆకాశాన పోయే నారదమహర్షి ఇది చూచాడు; నవ్వు ఆగిందికాదు. వెంటనే వచ్చి నమస్కరించి ఇదేమిటయ్యా! ఈలా మీరే తగువులాడుకుంటే ఎట్లా! మీకు సరియైన తీర్పు ఇవ్వగలవాడు ఆ పరమేశ్వరుడు మాత్రమే. అందువల్ల మీరు ఆయన దగ్గరకు వెళ్ళి తేల్చుకోండని సలహా యిచ్చాడు. బ్రహ్మ విష్ణుమూర్తి అందు కంగీకరించి ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళారు.

ఆయన వీరిని ఆహ్వానించి, ఈ కైలాసపర్వతానికి మీరు రావటం అదృష్టమని ఇంతకూ మీరు వచ్చినపని చెప్పమన్నాడు. బ్రహ్మ జరిగిందంతా వివరించి చిరునవ్వుతో నేను గొప్పకాదంటున్నాడు అని చెప్పాడు. ఈ మాటలు విని విష్ణుమూర్తి ముందొచ్చిన చెవుల కన్న వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు నా బొడ్లోనించి పుట్టి తాను గొప్పంటాడేమయ్యా! నీవే చెప్పవయ్యా అన్నాడు ఈశ్వరుణ్ణిచూచి. మీరిద్దరూ గొప్పవారే. ఒకరు సృష్టి; ఒకరు స్థితి, మీలో ఎవరులేక పోయినా లోకం జరుగదు. అన్నాడు. తప్పుకునే ధోరణిలో. అలాకాదు ఎవరు గొప్పో నిష్కర్షగా చెప్పాల్సిందే అని పట్టుబట్టారు. ఈశ్వరుని పని కుడితిలో పడ్డ ఎలుకలాగైంది. ఆయన గొప్పంటే ఈయనకు కోపము! ఈయన గొప్పంటే ఆయనకు కోపము. సరే. నేనొక పోటీపెడతాను. మీలో ఎవరు గెలిస్తే వారు గొప్ప అన్నాడు శివుడు. అందుకు ఇద్దరూ అంగీకరించారు. "సరి నేను లింగమవుతాను. నాతల చివరను ఒకరూ, అడుగు చివరను ఒకరు చూచి రావాలి అలా చూచి ఎవరు ముందువస్తే వారు గెలచినట్లు" అన్నాడు శివుడు.

ఈశ్వరుడు వెంటనే శివలింగంగా మారిపోయాడు. బ్రహ్మ పైకి పోయాడు పై అంచు చూసి రావటానికి. విష్ణుమూర్తి భూమిలోనికి పోయాడు. ఎంత పైకి పోయినా బ్రహ్మకు చివర కనపడలేదు. మనసు తహతహలాడుతుంది. విష్ణుమూర్తి ముందుగా వస్తాడేమోనని! అయినా పాపము ఎంతదూరము పోయినా అంతు కనిపించలేదు. ఆకాశగంగలో స్నానంచేసి మొగలిరేకు, గోవు తిరిగి వస్తున్నాయి. బ్రహ్మ వారిని చూచి మీరు ఈశ్వర లింగం చివరిభాగం చూచారా అన్నాడు. 'ఆఁ' అన్నవి. బ్రహ్మకు ఒక ఆలోచన తట్టింది. మొగలిరేకును, గోవును ప్రాధేయ పూర్వకంగా 'నేను చివర చూస్తుండగా మీరు నన్ను చూసినట్లు ఈశ్వరుడి చెప్పాలి' అన్నాడు. "మేము చూడనిదే ఏలా చెప్పగలం? అన్నవి అవి" "ఎట్లా అయినా నా కోసం అబద్ధ మాడండి. మీ మేలు మర్చిపోను" అని

★ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి ★

ప్రాధేయపడ్డాడు బ్రహ్మ. 'సరే బ్రహ్మంతటివాడు కోరితే మనము కాదనకూడదు.' సరే చెప్పుదామన్నది- మొగలిరేకు, దానికి బలవంతం మీద గోవు సరే నన్నది.

బ్రహ్మ ఈశ్వరుడి దగ్గరకు వచ్చాడు. ఇంకా విష్ణుమూర్తిరాలేదు. తరువాత చాలాసేపటికి విష్ణుమూర్తి కూడా అలసిపోయి వచ్చాడు. ఈశ్వరుడు విష్ణుమూర్తిని పలకరించి చివర చూచావా అన్నాడు. విష్ణుమూర్తి ఓటమిని అంగీకరించినవాడిలాగా-లేదన్నాడు. బ్రహ్మను కూడా నా శిఖరాన్ని చూచావా? అన్నాడు శివుడు. బ్రహ్మ సగర్వంగా 'చూచా'నన్నాడు. అయితే'సాక్ష్యమేమిటన్నాడు శివుడు. బ్రహ్మ 'నేను చూస్తుండగా ఈ మొగలిరేకు, ఈ గోవూ చూచాయి' అన్నాడు. మొగలిరేకును పిలిచి 'నిజంగా నీవు చూచావా' అని అడిగాడు శివుడు. అందుకు మొగలిరేకు చూచానని సమాధాన మిచ్చింది. గోవును పిలిచి అడిగితే నిజమేనని తలకాయ ఊపుతూ అబద్ధమని తోకాడించింది.

అబద్ధం చెప్పినందుకు పరమేశ్వరుడు బ్రహ్మను చీవాట్లు పెట్టి, నిజం చెప్పినందుకు విష్ణుమూర్తిని మెచ్చుకొన్నాడు. మొగలిరేకు అబద్ధం చెప్పినందుకు గాను "నీవు భగవంతుని పూజలకు పనికిరాకుండ పోదువుగాక!" అని శాపమిచ్చాడు. తరువాత ఆవును పిల్చి, "నీవు అబద్ధాన్ని సందేహిస్తూ చెప్పావు. తలతో చూచాడనీ, తోకతో లేదనీ చెప్పావు. ఆ పాపము నీ ముఖానికి చెందుతుంది. కాబట్టి నీముఖం కన్న నీ తోకను చూస్తేనే పుణ్యమెక్కువ అని చెప్పాడు." ఇక బ్రహ్మను చూస్తూ అసలు భూలోకంలో నీకు ఆలయంగాని, పూజలుగాని, పునస్కారాలుగాని లేకుండా పోవుగాక!' అని శపించాడు.

ఆ నాటినుంచి మనము మొగలి పూవును భగవంతిడికి అర్పించము. ఆవు వెనుక భాగాన్ని ప్రొద్దునే చూస్తాముగాని, ముఖాన్ని చూడము. బ్రహ్మకు ఆలయమే లేదు! ★

---

# ★ జీవనలీల ★

(19 వ పేజీ తరువాయి)

ఉందా? కుముద్ ఈ సమస్యకి కూడా పరిష్కారమార్గం చెప్పేవాడు. ఇంటికి వెళ్లగానే మతి రెండులోలకులూ చెవుల్నుంచి తీసేస్తుంది. రాత్రి చింతపండు పులుసులో నానబెట్టి, ప్రొద్దునే సోడా వేసి రుద్దితే, రెండూ మెరుగుపెట్టిన పాతలోలకులే అనిపిస్తుంది. ఎవరైనా అడిగితే మెరుగుపెట్టావని చెపుతుంది మతి—చింతపడు సోడావేసి మతి ఈమాటే...ఈ వాస్తవమైన మాటే చెప్పేస్తుంది.

కుముద్ తెలివితేటలు చూసి మతి తెల్లబోయింది.

"—మరోక పాము ఏదైనా కరిస్తే చచ్చిపోయేవాణ్ణేగా; నేను చచ్చిపోతే నువ్వు ఏంచేసేదానివి?"

"నేనా? నేనేం చేసేదాన్ని? ఏంచేసేదాన్నో ఏం తెలుసు నాకు?"

చిన్నపిల్ల. ఒక అమాయకపు పసిపిల్ల. కాని మతికి లోపల అన్నీ తెలుసు. ఆమెకి తెలియనిదేముంది? ఆ రోజున కుముద్ పాముకాటుతో పరమపదించినటయితే, తానేమీ చేసేదికాదని 'ఒకటో నెంబరు' మతికి తెలుసు. 'రెండో నెంబరు' మతికి—తాను చనిపోతే మతి దుఃఖిస్తుంది అన్నమాట కుముద్ వినాలని కోరుకుంటున్నాడని తెలుసు. ఇంతదూరం తెలుసు మతికి. ఆమె ఏమీ చేసేదికాదు అన్నది యథార్థమైన మాట. ఆమె కొంచెం ఏడ్చేది అన్నమాట అబద్ధం. ఇందులో ఏదీ చెప్పటానికి వీల్లేదు. ఇది కూడా మతికి తెలియకపోయినట్లయితే అటూ యిటూ కాని సమాధానం చెప్పి, అమాయకత్వాన్ని ఎందుకు నటిస్తుంది? ఏమయినా—ఎన్ని ఆధారాలయినా దొరకనియ్—మతిమాత్రం మతి వికసించని పసిపిల్లే...

"ఒకవేళ ఇప్పుడు చచ్చిపోతే?" అన్నాడు కుముద్.

"పోతే, నేను—ఆఁ ఇప్పుడు చచ్చిపోతేనా? పోండి చావుమాట నోటితో అనకూడదసలు."

మతి ఇవన్నీ ఎక్కడ నేర్చుకుందో ఎవరెరుగుదురు? తనంతట తానే నేర్చుకునిఉంటుంది కచ్చితంగా—మాట్లాడటం—అన్నం తినటం, బట్ట కట్టుకోవటం నేర్చుకున్నట్లు, ఇవన్నీ ఒకరు నేర్పక్కర్లేదు. ఎవరు నేర్పుతారు? ఇలా తర్వాత కుముద్ మతిని చాలా ప్రశ్న లడిగాడు. కుతూహలపు ప్రశ్నలు కావవి. ఆమె స్వవిషయాన్ని, ఆమె బంధుమిత్రుల విషయాన్ని, ఆ ఊళ్లో విషయాన్ని అడిగాడు. మతి ఎంతో ఆసక్తితో అతడడిగిన వాటి కన్నిటికీ సమాధానాలిచ్చింది. మధ్యమధ్య ఎదురుప్రశ్నలూ వేసింది...మధ్యలో ఒకటిరెండుసార్లు తనంతట తానే అవాంతర విషయాలుకూడా చెప్పింది. ఆమె సరళ దృష్టి ఒక్కసారైనా వక్రం కాలేదు. ఆమె విశ్వాసం రవంతైనా సడలిపోలేదు. మతి కేలాంటి దిగులూ లేదు. ఆమె కేమీ తెలియదు. ఏమీ అర్థంకాదు. ప్రపంచంలో అన్నీ ఆమె దృష్టికి క్రొత్తే. ఆమె ప్రపంచజ్ఞానానికి అతీతమైనదే. కుముదుణ్ణి తన చేతిని పట్టుకోనివ్వటం ఉచితమో అనుచితమో ఆమెకేం తెలుసు? అదంతా కుముదుడికి తెలియాలి. రాజపుత్రుడైన ప్రవీరుడికి తెలియాలి. మతి అంతగా సిగ్గుకూడా పడలేదు. అయితే హఠాత్తుగా ఆమె కళ్ళు క్రిందికి వాల్చుకుని, కొంచెం నవ్వింది కదా అంటే—అద్భుతమేంలేదు! దానికంత ప్రాధాన్యం ఇవ్వకూడదు...

రాత్రింబగళ్ళలో—మధ్యాహ్న సమయమే త్వరగ జారిపోతూ ఉంటుంది. పైన సూర్యుడు ఎంతసేపటికి ఎంతదూరం జరిగి, వాళ్ళమీదికి ఎండని ప్రసరింపచేసేవాడో తెలిసేదికాదు. వాళ్ళు లేచి చిన్నగుట్టవైపుకి నడిచేవారు. అక్కడ చెట్లనీడ మా చెడ్డ దట్టంగా ఉంటుంది... ★

—ఇంకా వుంది]